## రెండవ అధ్యాయము

# యేసు దేవుడై యున్నాడా?

పాపులను రక్షించుటకు యేసుక్రీస్తు లోకమునకు వచ్చెనని క్రైస్తవులు బోధించుచున్నారు. కాని పాపులను రక్షించుటకును, వారి అక్కరలు తీర్చుటకును, వారి బాధలు భరించుటకును సామాన్యమైన మానవుడు యోగ్యుడు కాడు. దేవుడగు రక్షకుడు మనకు కావలెను. యేసుక్రీస్తు తానే రక్షకుడని చెప్పుచుండగా ఆయన దేవుడైయుండి మనకు రక్షకుడుగా ఉన్నాడా? లేక ఏలాంటి రక్షకుడుగా ఉన్నాడని మనము మనలో ప్రశ్న వేసికొనవచ్చును. వేదముల వలన శ్రేష్ఠమైన నీతిక్రమములు నేర్చుకొంటున్నాము. కాని వాటిని అనుసరించలేక పోతున్నాము. దేవుడగు రక్షకుడు మనకు దొరికితేనే గాని మన గతి చాలా కష్టముగా నుండును. ఈ పరిస్థితియందు యేసుక్రీస్తే మనకు దేవుడును, రక్షకుడునై యున్నాడని క్రైస్తవులు నొక్కి చెప్పుదురు. ఇది నిజమా? అబద్ధమా? ఎట్లు తెలిసికొనగలము?

మొట్టమొదటిగా యేసుక్రీస్తు తాను దేవుడును రక్షకుడునై యున్నాడని తన విషయము నొక్కిచెప్పెనని గుర్తించెదము. తాను నిత్యుడని చెప్పెను (యోహాను 17:5,24). “అబ్రాహాము పుట్టక మునుపే నేనున్నానని” (యోహాను 8:58) చెప్పి తన నిత్యత్వమును గూర్చి విశదపర్చెను. “నేనును, తండ్రియును ఏకమై యున్నామ”ని (యోహాను 10:30-38) చెప్పి, యెన్ని తిట్లు వచ్చిన ఆ మాట స్థిరపర్చెను. “మీరు నన్ను ఎరిగి యుంటే నా తండ్రిని ఎరిగియుందురు ... నన్ను చూచినవారు తండ్రిని చూచియున్నారు ... తండ్రియందు నేనును నాయందు తండ్రియు నున్నాము ... నేనే మార్గమును సత్యమును జీవమునై యున్నాను. నా ద్వారానే తప్ప ఎవడును తండ్రియొద్దకు రాడు” అని యేసు చనిపోకమునుపు ఆఖరి రాత్రియందు తన శిష్యులను ధైర్యపర్చుటకును ఓదార్చుటకును చెప్పెను (యోహాను 14:6-11). తాను మహా రాజైన దావీదుకు ప్రభువుగా నున్నానని చెప్పుచు, కన్యక జననము యొక్క మర్మము మీద ఆధారపడి తాను దావీదు కుమారుడుగా కూడా నున్నానని బయలుపర్చెను (మార్కు 12:35-37). “ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి. నేను మీకు విశ్రాంతి కలుగజేతునని ఆయన ఆహ్వాన పిలుపు యివ్వక మునుపు తండ్రిగాక యెవడును కుమారుని ఎరుగడు; కుమారుడుగాకను, కుమారుడు ఎవనికి ఆయనను బయలుపర్చ నుద్దేశించునో వాడుగాకను మరి ఎవడును తండ్రిని ఎరుగడు” అని తన విషయము బయలుపర్చెను (మత్తయి 11:27-30). పరలోకమునకు తాను

ఆరోహణమై పోవుచుండగా "పరలోకమందును భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడియున్నది" అని చెప్పి తనకు కలిగిన సర్వాధికారమువలన తన శిష్యులను భూదిగంతముల వరకు పంపెను (మత్తయి 28:18). పరలోకమందుండి తన సేవకుడైన యోహానుకు ప్రత్యక్షమై "నేను మొదటివాడను కడపటివాడను జీవించువాడను; మృతుడనైతినిగాని ఇదిగో యుగయుగములు సజీవుడనై యున్నాను" అని చెప్పి తన నిత్యత్వమును గూర్చియు, తన దేవత్వమును గూర్చియు మరియొకసారి నొక్కి స్థిర పరచెను. (ప్రకటన 1:18; 22:13).

ఇది యంత చూస్తే యేసు విషయములో మూడు అభిప్రాయములు గలగవచ్చును. ఆయన అబద్ధికుడుగా నుండవచ్చు లేక పిచ్చిపట్టినవాడై యుండవచ్చును. లేక తాను చెప్పినరీతిగా దేవుడై యుండవచ్చును. ఆయన అబద్ధికుడైతే యీ మాటలు లక్ష్యపెట్ట నక్కర లేదు. ఆయన మనలను మోసపుచ్చుటకు ఈ మాటలు చెప్పినట్లయితే లక్ష్యపెట్ట నక్కరలేదు. ఆయన పిచ్చిపట్టినవాడై ఈ మాటలు చెప్పినట్లయితే మనము ఆయనమీద జాలిపడి ఓర్చుకొనవలెను. గాని ఆయన నిజముగా దేవుడై యుండి ఈ సత్యములు మనకు బయలుపర్చినట్లయితే మనము వాటిని లక్ష్యపెట్టి ఆయనను మన దేవుడుగా ఆరాధించి ఆయనను వెంబడించుట మన ఉత్తమమైన విధియైయున్నది. మీరు యేసు క్రీస్తు గొప్ప బోధకుడని చెప్పుచున్నారా? ఆయనను గొప్ప ప్రవక్తగా భావించుచున్నారా? అలాగైతే తాను దేవుడనని ఆయన బోధించినాడని జ్ఞాపకము చేసికొని ఆయనను మీ దేవునిగా అంగీకరించుట మీ మొదటి విధియై యున్నది. యేసుక్రీస్తు గొప్ప బోధకుడని ఆయనను మెచ్చుకుంటూ ఆయన తన విషయము బయలుపర్చిన సత్యము అంగీకరించ కుండా పోయినట్లయితే అది ధర్మమా?

యేసుక్రీస్తు తాను దేవుడనని తన నోటిద్వారా సాక్ష్యమిచ్చెను. మరియు తన క్రియలద్వారా కూడా అదే సాక్ష్యమిచ్చెను. "నేను నా తండ్రి క్రియలు చేయనియెడల నన్ను నమ్మకుడి, చేసినయెడల నన్ను నమ్మకున్నను, తండ్రి నాయందును, నేను తండ్రియందును ఉన్నామని మీరు గ్రహించి తెలిసికొనునట్లు ఆ క్రియలను నమ్ముడ"ని యేసు తన స్వప్రజలపై మనపై సవాలుచేసెను. (యోహాను 10:37). "తండ్రి యందు నేనును, నాయందు తండ్రియు ఉన్నామని నమ్ముడి; లేదా యీ క్రియల నిమిత్తమైనను నన్ను నమ్ముడి" అని మరియొక స్థలమందు మరియొకసారి సవాలు చేసెను. (యోహాను 14:11). క్రీస్తుకు పూర్వము దైవసేవకులు అప్పుడప్పుడు అద్భుత క్రియలు చేసిరి. వారిలోకూడ దైవశక్తి అప్పుడప్పుడు కనబడుచుండెను. వారు చేసిన సూచక క్రియలు లెక్కించినట్లయితే అది స్వల్పమైన లెక్కే. కాని యేసుక్రీస్తు చేసిన సూచకక్రియలను లెక్కింపలేనివి. "బోధకుడా, నీవు దేవునియొద్దనుండి వచ్చిన బోధకుడ

వని మేమెరుగుదుము; దేవుడతనికి తోడైయుంటేనేగాని నీవు చేయుచున్న సూచకక్రియలను ఎవడును చేయలేడ"ని యూదుల అధికారియైన నీకొదేము సాక్ష్యమిచ్చెను. (యోహాను 3:2). "మరియు జనసమూహములో అనేకులు ఆయనయందు విశ్వాసముంచి- క్రీస్తు వచ్చునప్పుడు ఈయన చేసినవాటికంటె ఎక్కువైన సూచక క్రియలు చేయునా అని చెప్పుకొనిరి" (యోహాను 7:31). "దేవుడు నజరేయుడైన యేసును పరిశుద్ధాత్మతోను శక్తితోను అభిషేకించెను ... దేవుడాయనకు తోడైయుండెను. గనుక ఆయన మేలుచేయుచు, అపవాదిచేత పీడింపబడిన వారినందరిని స్వస్థపరచుచు సంచరించుచుండెను" అని మొదటి శిష్యులు సాక్ష్యమిచ్చిరి. (అపొస్తలుల కార్యములు 10:38). "మరియు అనేకమైన యితర సూచకక్రియలను యేసు తన శిష్యులయెదుట చేసెను; అవి ఈ గ్రంథమందు వ్రాయబడియుండలేదు. గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20:30-31); "యేసు చేసిన కార్యములు ఇంకను అనేకములు కలవు. వాటిలో ప్రతిదానిని వివరించి వ్రాసిన యెడల అట్లు వ్రాయబడిన గ్రంథములకు భూలోకమైనను చాలదని నాకు తోచుచున్నది" అని ఆయన సూచక క్రియలను కన్నులార చూచిన ఆయన శిష్యుడగు యోహాను సాక్ష్యమిచ్చెను (21:25). మోషే ఒకవేళ కొన్ని అద్భుత కార్యములు చేసెను. ఎలీషా ఒకవేళ అద్భుత కార్యములు చేసెను. క్రీస్తుకు పూర్వమును క్రీస్తుకు తరువాతనున్న కొంతమంది దైవసేవకులు కొన్ని అద్భుత కార్యములు చేసిరి. కాని క్రీస్తు లెక్కింపలేని సూచక క్రియలను చేసినందువలన ఆయన వారికంటె గొప్పవాడుగా ఎంచబడెనని స్పష్టమగుచున్నది.

యేసు దేవుడైయున్నాడని ఆయన క్రియలు ఇచ్చిన సాక్ష్యముకంటే ఆయన శీలము మరీ శ్రేష్ఠమైన సాక్ష్యమును ఇచ్చుచున్నది. "నాయందు పాపమున్నదని మీలో ఎవడు స్థాపించును?" అని యేసు తన శత్రువులపై సవాలువేసిన సందర్భమందు శత్రువులు సహితము ఆయనలో పాపమున్నదని నిరూపించలేక పోయిరి. (యోహాను 8:46). "అతనియందు ఏ దోషమును నాకు కనబడలేదు" అని పిలాతు విమర్శించి తేల్చిన సత్యము సర్వాంగీకారమైనదిగా నున్నది (యోహాను 18:38; లూకా 23:4). మనయందు మంచితనమును చెడుతనమును ఏకీభవించియున్నవి. అప్పుడప్పుడు శాంతిగా ఉండెదము, అప్పుడప్పుడు కోపపడెదముగాని యేసునందు మంచితనము ఏ కొరత లేకుండా సంపూర్ణముగా నుండినది. ఆయన అన్ని విషయములలో మనవలెనే శోధింపబడినను పాపము లేనివాడుగా నుండెను. (హెబ్రీ 4:15). పాపము లేనివాడుగా నుండి నంత మాత్రాన ఆయనలో మంచితనము సంపూర్ణముగా నుండెనని మా భావము కాదు. దానికంటె ఇంకా శ్రేష్ఠమైన భావమున్నది. అనగా ఉత్తమమైన ప్రతి మంచికార్యము

చేయుటయందు ఆయన శక్తిగలవాడై యున్నాడని మా భావము. ఆయన కుష్ఠరోగులను స్వస్థపరచినప్పుడు దూరముగా నిలువబడి ఒక మాటతో సూచకక్రియ చేయలేదు. గాని వారిని సమీపించి ముట్టి వారిమీద తనకున్న ప్రేమను వెల్లడిపర్చి వారిని స్వస్థపరచెను (లూకా 5:13). సాత్వికమునకు దృష్టాంతముగా మోషేను తీసుకొనకుండా యేసును తీసుకొనుట తగినది. మోషే భూమిమీద నున్న వారందరిలో మిక్కిలి సాత్వికుడు (సంఖ్యాకాండము 12:3). గాని "నేను సాత్వికుడను, దీనమనస్సు గలవాడను గనుక మీ మీద నాకాడి ఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును" అని యేసే చెప్పగలిగినాడు. అయితే మోషే చెప్పలేక పోయినాడు. అనేక బాధలు అనుభవించిన యోబును ఓపిక కొరకు మాదిరిగా తీసికొనినను (యాకోబు 5:11), యేసుతట్టు చూచుచూ మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తవలెనని హెచ్చరింపబడి యున్నాము (హెబ్రీ. 12:2). జ్ఞానియైన సొలొమోను కంటే యేసుక్రీస్తు గొప్ప జ్ఞానము గలవాడు (మత్తయి 12:42). దైవభక్తి విషయములో పౌలు ఎంత ఆసక్తిపరుడైనను ఆయనకంటె క్రీస్తు గొప్పవాడు. నిజముగా క్రీస్తు ప్రేమ పౌలును బలవంతము చేసినది (2 కొరింథీ 5:14). దేవుని యింటినిగూర్చిన ఆసక్తి యేసును భక్షించినందువలన (యోహాను 2:17) మన మందరము ఆసక్తి విషయములో యేసువలననే బలవంతపర్చబడితిమి. మన మందరము పాపాత్ములమై యుండగను దేవునికి విరోధులమై యుండగను, యేసు మనలను ప్రేమించి మనలను రక్షించుటకు తన ప్రాణము పెట్టినందువలనను ప్రేమ ఆయనలో సంపూర్ణముగా నివసించెనని గమనించితిమి. ప్రార్థన విషయములో మనకు మంచి మాదిరి కావలెనంటే అబ్రాహాము, మోషే, దానియేలు, బాప్తీస్మమిచ్చు యోహాను మొదలగువారి అందరికంటే యేసు శ్రేష్ఠుడు. "మాకు ప్రార్థనచేయ నేర్పుమ"ని (లూకా 11:1) ఆయన శిష్యులు అడిగిన రీతిగా అనేకులు యేసు యొద్దకు వచ్చి బ్రతిమలాడిరి. శీలములో యేసుక్రీస్తు శ్రేష్ఠుడు. ఆయన గుణలక్షణములన్నీ మనకు మాదిరికరమై యున్నవి. ఆయన శీలమునుబట్టి చూస్తే "దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నద"ని పౌలు గ్రహించిన సత్యము యొక్క లోతైన అర్థము మనకు స్పష్టమగుచున్నది. (కొలస్సీ 2:9).

"తండ్రీ, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమ"ని (లూకా 23:34) యేసు చేసిన ప్రార్థనలో ఆయన దైవత్వము కనబడుచున్నది. 1941 సంవత్సరములో జపాను వారు యుద్ధము చేయనారంభించిన ఆ మొదటి ప్రొద్దున విమానము నడిపించిన సైన్యాధిపతియైన మిత్స్వోచ్చుడా ఈ మధ్య యేసు జీవిత చరిత్ర చదువుచు యేసు తన శత్రువుల కొరకు చేసిన ప్రార్థన చదువగా ఆయన హృదయము బ్రద్దలై

పోయినది. సైన్యాధిపతియైన వోచ్చుడా మారుమనస్సు పొంది సంతాపపడి నమ్మి ఇప్పుడు ... తాను సంపూర్ణముగా సమర్పించుకొనియున్నాడు. క్రీస్తునుగూర్చి మీకేమి తోచు చున్నది? ఆయన మోసగాడా? లేక పిచ్చుపట్టినవాడా? లేక దేవుడా? ఆయన దేవుడైతే ఆయనను వెంబడించుము. ఆయన దేవుడని ఆయన శీలము రుజువుపర్చుట లేదా?

యేసు దేవత్వమును గూర్చి మూడు రుజువులను పరీక్షించితిమి. ఇంకా నాలుగు సాక్ష్యములను పరీక్షించెదము. 1. దయ్యములు ఇచ్చిన సాక్ష్యము విందాము. "దేవుని కుమారుడా, నీతో మాకేమి? కాలము రాకమునుపే మమ్మును బాధించుటకు ఇక్కడికి వచ్చితివా? అని కేకలు వేసిరి." (మత్తయి 8:29). "వద్దు నజరేయుడవగు యేసూ, మాతో నీకేమి, మమ్ము నశింపజేయుటకు వచ్చితివా? నీవెవడవో నాకు తెలియును; నీవు దేవుని పరిశుద్ధుడవు అని కేకలు వేసెను" (మార్కు 1:24). అపవిత్రాత్మలు పట్టిన వారు, ఆయనను చూడగానే ఆయన యెదుట సాగిలపడి – "నీవు దేవుని కుమారుడవని చెప్పుచు కేకలు వేసిరి" (మార్కు 3:11). "దయ్యములు – నీవు దేవుని కుమారుడవని కేకలు వేసి అనేకులను వదలిపోయెను; ఆయన క్రీస్తు అని వాటికి తెలిసియుండెను" (లూకా 4:41).

2. యేసు దేవుని కుమారుడని ఆయన శిష్యులు ఆరంభములో గ్రహించలేదు. కాని క్రమేణ ఆయన తన దేవత్వము విషయము చెప్పుచున్న మాటలు విని ఆయన చేస్తున్న క్రియలు చూచి ఆయన శీలము పరీక్షించి చూడగా ఆయన దేవుని కుమారుడని గుర్తెరిగిరి. రెండున్నర సంవత్సరముల వరకు ఆయనతో సహవాసము ననుభవించిన తరువాత పేతురు శిష్యులందరి తరుపున చేసిన ఒప్పుకోలు చాలా గొప్పది. "మీరైతే నేను ఎవడనని చెప్పుకొను చున్నార"ని యేసు తన శిష్యులను అడుగగా, "పేతురు – నీవు సజీవుడగు దేవుని కుమారుడ వైన క్రీస్తువని చెప్పెను" (మత్తయి 16:15-16). పేతురుకు అంత ఆత్మసంబంధమైన వివేకము కలిగినందువలన యేసు చాలా సంతోషించెను. తోమా – "నా ప్రభువా, నా దేవా" అని యేసు పాదములమీద సాగిలపడి సాక్ష్యమిచ్చెను (యోహాను 20:28). చాలా ఏండ్లయిన తరువాత యోహాను తన సువార్త ఆరంభములో "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవునియొద్ద ఉండెను. వాక్యము దేవుడై యుండెను" అని యేసు దేవత్వమును గూర్చి తన సాక్ష్యమిచ్చెను (1:1,2). యేసు దేవుని కుమారుడని నిరూపించుటకు యోహాను తన సువార్త వ్రాసెను (యోహాను 20:31).

3. యేసు తన కుమారుడని దేవుడుకూడ సాక్ష్యమిచ్చెను. ముఖ్యముగా మూడు సందర్భములలో తండ్రి తన కుమారుని విషయములో సాక్ష్యమిచ్చును. యేసు బాప్తీస్మము తీసికొనిన తరువాత తండ్రి "ఈయన నా ప్రియకుమారుడ"ని సాక్ష్యమిచ్చెను. (మత్తయి 3:17). యేసు రూపాంతరము పొందినప్పుడు మరియొకసారి "ఈయన నా ప్రియ

కుమారుడు" అని తండ్రి సాక్ష్యమిచ్చెను (మత్తయి 17:5). యేసు సిలువ మరణము పొందనైయుండగా తన కుమారుని బలపరుచుటకు "నీ నామము మహిమపరచితిని మరల మహిమపరతును" అని సాక్ష్యమిచ్చెను (యోహాను 12:28). ఇప్పటి వరకును నిరంతరమును పరలోకమందు తండ్రి సాక్ష్యమిచ్చుచున్నాడు (1 యోహాను 5:5-8).

4. తండ్రితో కూడా పరిశుద్ధాత్ముడు యేసుక్రీస్తు దేవుని కుమారుడని సాక్ష్యమిచ్చు చున్నాడు; దానికొరకే పరిశుద్ధాత్ముడు పంపబడెను (యోహాను 15:26; 16:8-16). "పరిశుద్ధాత్మవలన తప్ప ఎవడును యేసుప్రభువని చెప్పలేడ"ను మాటనుబట్టి ఆలోచించి నట్లయితే యేసు దేవత్వమును గూర్చి పరిశుద్ధాత్ముడు మన హృదయములో ఇచ్చే సాక్ష్యము ఎంత ముఖ్యమైనదో గమనించగలము (1 కొరింథీ 12:30; 1 యోహాను 4:13-15 సరిపోల్చుము). నిజముగా యేసుక్రీస్తు దేవుని కుమారుడని మనము నమ్మ వలెనంటే పరిశుద్ధాత్ముడు మన హృదయములలో సాక్ష్యము ఇవ్వవలయును. (1 యోహాను 5:5-10). "దేవుని కుమారునియందు విశ్వాసముంచువాడు తనలోనే ఈ వాక్యము కలిగియున్నాడు; దేవుని నమ్మనివాడు ఆయన తన కుమారునిగూర్చి యిచ్చిన సాక్ష్యమును నమ్మలేదు. గనుక అతడు అబద్ధికునిగా చేసినవాడే (1 యోహాను 5:10). యేసు దేవత్వమును గూర్చి దయ్యము లిచ్చిన సాక్ష్యమును శిష్యులిచ్చిన సాక్ష్యమును తండ్రియైన దేవుడిచ్చిన సాక్ష్యమును పరిశుద్ధాత్ముడు ఇచ్చిన సాక్ష్యములను అంగీకరించి తిరా? లేక దేవుని అబద్ధికునిగా చేసితిరా?

పైన ఉదహరింపబడిన విషయములన్నిటికంటె యిప్పుడు శ్రేష్ఠమైన విషయమును ఆలోచించుటకు సిద్ధముగా నున్నాము. యేసుక్రీస్తు మృతులలోనుండి పునరుత్థానుడై నందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారునిగా ప్రభావముతో నిరూపించ బడినవాడాయెను (రోమా 1:5). యేసు తాను దేవుని కుమారుడనని ఎంత నొక్కిచెప్పినా ఆయన ఇంకా సమాధిలోనే ఉండియుంటే దేవుని కుమారుడుగా యెంచుటకు యెంత మాత్రము వీలుకాదు. ఒకడు సూచక క్రియలను చేసినందువలన ఆయన దేవుని కుమారుడని మనము చెప్పినట్లయితే ప్రవక్తలనుకూడా దేవుని కుమారులుగా యెంచ వలెనుగదా? అట్లు చేయుటకు వీలుకాదు. యేసుక్రీస్తు సూచక క్రియలను చేసినంత మాత్రాన ఆయన దేవుని కుమారుడుగా నిరూపింపబడలేదు. గాని ఆయనలో దైవశక్తి యుండెనని కనపరచబడెను. ఆయన ఎన్ని సూచక క్రియలు చేసినను ఇతరులవలె చనిపోయి సమాధిలోనే యుండినట్లయితే ఆయనను దేవుని కుమారునిగా యెంచుటకు వీలుండదు. గాని ఆయన పునరుత్థానుడైనందువలన దేవుని కుమారునిగా నిరూపింప బడెను. ఆయన శీలము ఎంత ఉత్తమమైనదైనను ఆయనలో సంపూర్ణమైన మంచి గుణలక్షణములు ఉండినను ఆయన యితరులవలె చనిపోయి సమాధిలోనే ఉండి

నట్లయితే, ఆయనను దేవుని కుమారునిగా నిరూపించుటకు వీలుండదు. గాని మృతులలో నుండి లేచి దేవుని కుమారుడుగా నిరూపింపబడెను. "తాను మృతులకును, సజీవులకును ప్రభువై యుండుటకు ఇందు నిమిత్తమే గదా క్రీస్తు చనిపోయి మరల బ్రదికెను." (రోమా 14:9).

యేసు తన దేవత్వము విషయములో చెప్పిన బోధ అంతటికిని ఆయన చేసిన సూచక క్రియలన్నిటికిని ఆయన ఉత్తమమైన శీలమునకును ఆయన పునరుత్థానము మూలకు తలరాయిగా ఉండెను. పునరుత్థానము లేకయే అవన్నియు అసంపూర్ణములు. ఇవన్నియు ఈయన మృతులలోనుండి పునరుత్థానము పొందవలెనని ముందుగా కేకలు వేయుచుండినవి. వీటికి పై శిఖరముగా ఆయన పునరుత్థానము నియమింపబడినది.

యేసుక్రీస్తు దేవుడై యున్నాడని మనము నమ్ముటకు ఎనిమిది ఆధారములను యిప్పటివరకు ఆలోచించియున్నాము.

1. ఆయన తన దేవత్వము విషయము నొక్కి యిచ్చిన సాక్ష్యము.
2. ఆయన చేసిన సూచక క్రియలు
3. ఆయన శ్రేష్ఠమైన శీలము.
4. దయ్యములు యిచ్చిన సాక్ష్యము.
5. శిష్యులు యిచ్చిన సాక్ష్యము.
6. తండ్రియైన దేవుడు యిచ్చిన సాక్ష్యము.
7. పరిశుద్ధాత్మ యిస్తున్న సాక్ష్యము.
8. ఆయన పొందిన పునరుత్థానము.

ఇవి అన్నీ మనము ఆలోచింపగా, యేసును మన దేవునిగా అంగీకరించకుండా యుండగలమా? ఆయనను తమ దేవునిగా అంగీకరించినవారికి తృప్తికలదు. 1950 వ సంవత్సరములో అమెరికా దేశములో ఒకడు మోటారు కారును దొంగిలించెను. తరువాత పట్టుపడెను. కొంతకాలము ఖైదీగా బంధింపబడిన తరువాత తప్పించుకొని పోయెను. తప్పించుకొనిపోయి వణుకుచు దాగుకొనియుండగా భయంకరమైన ఒక జబ్బు వచ్చినది. ఆ పరిస్థితియందు దేవుడు తనను స్వస్థపరచి బ్రతికించినట్లయితే యేసు క్రీస్తును తన రక్షకునిగా అంగీకరించి తన విషయమంత చక్కపెట్టుతానని ప్రమాణము చేసెను. తన నమ్మకము చొప్పున దేవుడు అతనిని స్వస్థపరచెను. ఆ తరువాత పోలీసు వారికి తన్ను తాను అప్పగించుకొని తాను చేసినదంతయు ఒప్పుకొనెను. తాను బాప్తిస్మము తీసుకొనునట్లు విడుదల యిమ్మని పోలీసువారిని అడుగగా, బాప్తీస్మము కొరకే విడుదల దొరికినది. ఆయన బాప్తీస్మము తీసుకొని తిరిగివచ్చి జైలులో ఖైదీగా బంధింప

బడెను. జైలులోని వారికందరికి యేసుక్రీస్తు వలన ఆయనకు దొరికిన శాంతి విషయము తెలియజేసెను. యేసు ఆయనను రక్షించెను. ఎంత పాపియైనను ఒకడు యేసుయొద్దకు ఉన్నపాటున వచ్చినట్లయితే యేసు ఆయనను రక్షించగలడు. దేవుడగు రక్షకుడు ఈయనే. మీరాయనను అంగీకరించితిరా? అంగీకరించెదరా?

50 సం॥ముల క్రిందట ఈ భారతదేశములో ఒక బీదగ్రామములో ఒక పిల్లవాడు తన బంధుమిత్రాదులను విడిచిపెట్టి యేసు నొద్దకు వచ్చెను. అనేక హింసలు కలిగినవి. ఆయన అది అంతయు ఓర్చుకొని తన చింతయావత్తు యేసుమీద వేసెను. ఈ మధ్య నేను ఆయనతో మాట్లాడుచుండగా, ఆయన ఇచ్చిన సాక్ష్యమేమనగా "నేను మరియొక సారి పిల్లవాడనైయుండి యేసు విషయము తీర్మానము చేయవలసియుంటే 20 సార్లు సహితము యేసును నా దేవునిగా అంగీకరించి ఆయనను వెంబడించి యుందును. ఈ జీవితములో ఆయన నన్ను తృప్తిపరచెను; నా ఆకలి తీర్చెను; నేను చనిపోయినప్పటికీ నేను ఆయనతో ఏకీభవించి సంతోషింతునని నాకు మంచి నిరీక్షణ కలుగజేసియున్నాడు" అని నాతో చెప్పెను. యేసుక్రీస్తు ఈలాంటి దేవుడు. పూర్వకాలమందు దేవుని కుమారునిగా నిరూపింపబడి నేటివరకును నిరంతరమును మనకు దేవుడైయున్నాడు. మీరు ఆయనకు లోబడినట్లయితే తృప్తిపడి సంతోషింతురు. ఆయనను మీ దేవునిగా అంగీకరించెదరా? మీరాయనను అంగీకరించవలెనని పైన ఎనిమిది రుజువులు చూపించితిమి. మీరాయనను అంగీకరించినట్లయితే వాటియొక్క సారాంశము మీ అనుభవములో తెలిసికొందురు. దేవుడేలాటివాడై యున్నాడో తెలిసికొనవలెనంటే యేసుప్రభువు తట్టు చూడుము. యెందుకంటే "దేవత్వముయొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తు నందు నివసించుచున్నది" (కొలస్సీ. 2:9). ఆయన దేవుని మహిమయొక్క ప్రతిబింబమును ఆయన తత్వముయొక్క మూర్తిమంతమునైయుండి, తన మహత్తుగల మాటచేత సమస్తమును నిర్వహించుచు, పాపముల విషయములో శుద్ధీకరణము తానేచేసి ... ఉన్నత లోకమందు మహామహుడగు దేవుని కుడిపార్శ్వమున కూర్చుండెను" (హెబ్రీ 1:4).